క్లుప్తంగా

యోగానంద్‌కు టికెట్ ఇవ్వాలి.. ప్లకార్డుల ప్రదర్శన



గచ్చిబౌలి: శేరిలింగంపల్లి టికెట్‌ను గజ్జెల యోగానంద్‌కు కేటాయించాలని ఆయన అనుచరులు నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద ప్లకార్డులు ప్రదర్శించారు. గురువారం రాష్ట్ర నాయకులను కలిసిన అనంతరం మన శేరిలింగంపల్లి, మన యోగానంద్ అనే ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు.

సాయిబాబాకి బంగారు కిరీటం బహూకరణ



కిరీటధారణ చేస్తున్న దాతలు మోహనాచారి, శైలజ దంపతులు, కుమారులు

ఆల్విన్‌కాలనీ: ఎన్‌టీఆర్‌నగర్‌లోని శ్రీ షిరిడి సాయిబాబాకు కూకట్‌పల్లి వాస్తవ్యులు పి. మోహనాచారి, శైలజ దంపతులు గురువారం సాయిబాబాకు బంగారు కిరీటం బహూకరించారు. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మోహనచారి దంపతులను శాలువాతో సత్కరించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శివకృష్ణశర్మ, వాసుదేవరావు, పోశెట్టి గౌడ్, పద్మయ్యగౌడ్, రాజలక్ష్మీ, మధులత, మంజుల, స్వరూపరాణి, కృష్ణవేణి, సురేఖ, సౌందర్య పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేయాలి

● కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ కార్యాలయంలో గురువారం బీఆర్‌యస్ పార్టీ మహిళా నాయకులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశమై ఎన్నికల కార్యాచరణ గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గాంధీని మూడోసారి గెలిపించుకోవటానికి మనందరం కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్‌లో వంద కోట్లకు పైగా నిధులతో రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు తదితర వసతులు కల్పించారన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, పాండుగౌడ్, పోశెట్టి గౌడ్, మహిళా నాయకురాళ్లు రాజ్యలక్ష్మీ, మధులత, స్వరూప, లావణ్య, మంజుల, పుట్టందేవి, స్వరూప, స్వప్న, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం.. కేసు నమోదు

పటాన్‌చెరు టౌన్: బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులురెడ్డి అన్నారు. గురువారం విశ్వసనీయ సమాచారం మేరకు అమీన్‌పూర్ గ్రామంలో ఎండి అఫ్రోద్ కిరాణాషాప్‌లో మద్యం విక్రయిస్తున్నాడని తెలుసుకున్న పోలీసులు దాడులు నిర్వహించి రూ.6 వేలు విలువ చేసే మద్యంను స్వాధీనం చేసుకున్నారు. మరో ఘటనలో అమీన్‌పూర్ పరిధిలోని పటేల్‌గూడ గ్రామంలో శ్రీశైలం స్క్రాప్ దుకాణంలో మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో దాడులు నిర్వహించి రూ.4 వేలు విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఇరువురిపై కేసు నమోదు చేశారు.

బెల్ట్ దుకాణాలపై సీసీఎస్ పోలీసుల దాడులు

అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ దుకాణాలపై గురువారం దాడులు నిర్వహించి మద్యం స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. జిల్లా ఎస్పీ రూపేష్ ఆదేశాల మేరకు సీసీఎస్ పోలీసులు ఇస్నాపూర్‌లో రెండు బెల్ట్ దుకాణాలపై, అలాగే చిట్కుల్ గ్రామ పరిధిలో మరో రెండు దుకాణాలపై సీఐ మహేష్ గౌడ్,, ఎస్ఐ సాయిలు దాడులు నిర్వహించారు. ఇందులో 45 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుల పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారని తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్ అన్నారు.గురువారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలో తెల్లాపూర్ మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు దేవేందర్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత పదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వెళ్లి వివరించాలని కోరారు. కార్యకర్తలు సైనికుల్లా పని చేసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్ రెడ్డి ,తెల్లాపూర్ మాజీ సర్పంచ్ మల్లెపల్లి సోమిరెడ్డి, సీనియర్ నాయకులు నాగిరెడ్డి, అల్లావుద్దీన్, యాదగిరి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాంబే.. వామ్మో

గృహ సముదాయాల పక్కనే గుట్టలుగా పేరుకుపోయిన చెత్త



హఫీజ్‌పేట్ : చందానగర్ పాపిరెడ్డికాలనీ సమీపంలోని వాంబే గృహ సముదాయం చెత్త కుప్పలతో నిండిపోతుంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాలు ప్రారంభమయ్యేది ఇక్కడ నుంచే అయినా బస్తీల పరిస్థితి మాత్రం మారడం లేదు. నిత్యం ఈ పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది బస్తీలలో పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్నా ఫలితం కనపడడం లేదు.

- స్థానికులు చెత్తను చెత్త ఆటోలకు ఇవ్వకుండా వాంబే ఇళ్ల మధ్య వేస్తున్నారు.
- పారిశుధ్య కార్మికులు శుభ్రం చేయకపోవడంతో చెత్త గుట్టలుగా పేరుకుపోతోంది.
- చెత్తను రోడ్లపై, ఇళ్ల సమీపంలో వేస్తుండడంతో పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి.
- రోడ్లపై మురుగునీరు పొంగిపొర్లుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రోడ్ల పక్కన చెత్త చెదారం



రోడ్డుపై పారుతున్న మురుగు

అటువైపు వెళ్లాలంటే భయపడుతున్నాం..



వాంబే గృహాల మధ్య రోజుల తరబడి చెత్త చెదారం పేరుకుపోవడంతో వెలువడుతున్న దుర్వాసన భరించలేకపోతున్నాం. మురుగునీరు రోడ్లపై పారుతోంది. ఇప్పటికైనా అధికారులు చెత్తను ఆటోలోనే వేసే విధంగా చూడాలి. చెత్తను ఆటోలో వేయని వారిపై చర్యలు తీసుకోవాలి.

–వెంకటేష్, రాజీవ్ గృహకల్ప

ఏళ్లు గడుస్తున్నా.. చెత్త సమస్య



వాంబే ఇళ్ల సముదాయాల మధ్య పేరుకుపోయిన చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదు. ఫిర్యాదు చేసిన రెండు రోజులు అధికారులు హడావిడి చేస్తారు. తర్వాత సమస్య మామూలే. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చెత్త సమస్యకు పరిష్కారం చూపాలి.

–విజయ్‌కుమార్, రాజీవ్ గృహకల్ప

బీహెచ్‌ఈఎల్ ఎంఐజీ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు 28న..



బీహెచ్‌ఈఎల్ ఎంఐజీ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ఆఫీస్

శేరిలింగంపల్లి: బీహెచ్‌ఈఎల్ ఎంఐజీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. ఏడు మేనేజింగ్ కమిటీ మెంబర్లను ఎన్నుకోవాల్సి ఉండగా, మహిళల కోటాలో ఉన్న ఇద్దరు మెంబర్లకు గాను ఒకరు మాత్రమే నామినేషన్ వేయగా సి.విద్యాధరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన ఆరు మేనేజింగ్ కమిటీ సభ్యులకు గాను ఓపెన్ కేటగిరిలో నాలుగింటికి 9 మంది అభ్యర్థులు.. అబ్దుల్ రహమాన్, సి.నర్సయ్య, ఎస్.నారాయణ, ఎం.నీలంకఠరావు, బాలయ్య దాసరి, రామునాయుడు.పి, పి.వెంకట్రావ్, ఏకె శర్మ, సుబ్బారావు కేవీ పోటీ పడుతున్నారు. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ విభాగంలో ఒక మెంబర్‌కు గాను చింత రాములు, ఎస్ కరుణాకరరావులు పోటీ పడుతున్నారు.

ఈనెల 28న పోలింగ్

బీహెచ్‌ఈఎల్ ఎంఐజీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్‌కు ఈ నెల 28వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఎన్నికల అధికారి మాధవరెడ్డి తెలిపారు. హౌసింగ్ సొసైటీ ఎన్నికల్లో 277 మందికి ఓటుహక్కు ఉన్నట్లు వివరించారు. కాలనీలోని శ్రీవాణి విద్యానికేతన్ హైస్కూల్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం 3.30 గంటల నుంచి కౌంటింగ్ చేస్తామన్నారు.

స్ట్రాంగ్‌రూంలకు చేరిన ఈవీఎంలు

గచ్చిబౌలి: ఈవీఎంలు బుధవారం రాత్రి గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు చేరాయి. ఎన్నికల అధికారులు, స్థానిక పోలీసులు, కేంద్ర బలగాల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేశారు. 52–శేరిలింగంపల్లి నియోజవర్గం రిటర్నింగ్ ఆఫీసర్ బి.శ్రీనివాస్‌రెడ్డి స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. 24 గంటలు కేంద్ర బలగాలతో పాటు గచ్చిబౌలి పోలీసులు భద్రత కల్పిస్తారని ఆర్‌ఓ తెలిపారు. ఇండోర్ స్టేడియం చుట్టూ, లోపల, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.



‘మనూ’లో జెండర్ చాంపియన్స్ క్లబ్ ప్రారంభం



రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో జెండర్ ఛాంపియన్స్ క్లబ్‌ను యూనివర్శిటీ ఓఎస్‌డీ–1 ప్రొఫెసర్ షుగుఫ్తా షాహీన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో షాహీన్ మాట్లాడుతూ లింగ సమానత్వం, సమ్మిళితతను ప్రోత్సహించే లక్ష్యంతో ‘మనూ’ కమ్యూనిటీకి లింగంతో సంబంధం లేకుండా మంచి వాతావరణాన్ని సృష్టించే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. లింగ సమానత్వం, మహిళా సాధికారత, హక్కులకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించేందుకు సెమినార్లు, వర్క్‌షాప్‌లను, అవగాహన ప్రచారాలను నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో ఉర్దూ విశ్వవిద్యాలయం స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొ. సయ్యద్ అలీమ్ అష్రఫ్, జాయింట్ డీన్ ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ సమీ సిద్దిఖీ, సమావేశం నోడల్ అధికారిణి సబాఖాతూన్, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

29న బీఆర్‌ఎస్ పార్టీ కార్మిక విభాగం సమావేశం

పటాన్‌చెరు టౌన్: రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్‌ఎస్ పార్టీ విజయం కోసం ప్రతి కార్మికుడు భాగస్వామి అయ్యేలా ఈనెల 29న పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నియోజకవర్గ స్థాయి కార్మికుల సమావేశం నిర్వహిస్తున్నట్లు బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని కార్మికుల ఆరోగ్యభద్రత కోసం ఇటీవల 300 కోట్ల రూపాయలతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి విజయానికి ప్రతి ఒక్కరు తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు.

యువతలో గుండె సంబంధిత మరణాలు పెరుగుతున్నాయి

● సెమి డైరెక్టర్ డా.హరిప్రసాద్
● సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా జూబ్లి ఉత్సవాలు



మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో విద్యార్థులకు సామూహిక శిక్షణ

మాదాపూర్: ఆరోగ్యకరమైన జీవనశైలి, స్క్రీనింగ్‌పై అవగాహన లేకపోవడం వంటి కారణాల వల్ల యువతలో గుండె సంబంధిత మరణాలు పెరుగుతున్నాయని సెమి (సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా) డైరెక్టర్ డాక్టర్ హరిప్రసాద్ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో గురువారం సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా 25 సంవత్సరాల జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా 2వేల మంది విద్యార్థులకు సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్)లో సామూహిక శిక్షణ, హ్యాండ్స్ ఆన్ ప్రాక్టీస్‌ను నిర్వహించింది. కార్డియాక్ ఎమర్జెన్సీలో ప్రాణాలను కాపాడేందుకు సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చింది. డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ ఆలస్యంగా ఆసుపత్రిలో చేరడం ద్వారా ప్రాణాలు పోతున్నాయని కార్డియాక్ ఎమర్జెన్సీలో ప్రతి నిమిషం ముఖ్యమని తెలిపారు. సీపీఆర్ రక్తాన్ని ముఖ్యమైన అవయవాలకు ప్రవహింపజేస్తుందని తెలిపారు. ఈనెల 29వ తేదీ వరకు వేడుకలను నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సెమీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. శరవణకుమార్, సెమి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్.కె. సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లను సందర్శించిన పోలీస్ అధికారులు



అంబేద్కర్ నగర్‌లో ఉన్న పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీఐ ప్రేమ్‌కుమార్

హఫీజ్‌పేట్ : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మియాపూర్, చందానగర్ స్టేషన్ల పరిధిలోని వివిధ కాలనీలలో ఉన్న పోలింగ్ స్టేషన్లను గురువారం సీఐలు ప్రేమ్‌కుమార్, పాలవెల్లిలు ఎస్ఐలతో కలిసి సందర్శించారు. పోలింగ్ స్టేషన్ల లోపల, బయట చేపట్టాల్సిన భద్రతపై ఎస్ఐలతో చర్చించి పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ల వద్ద ఎంతమంది సిబ్బంది అవసరమో జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు.

ప్రజలు ఓటుహక్కును వినియోగించుకోవాలి



ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీసులు, సీఐఎస్ఎఫ్ జవాన్లు

హఫీజ్‌పేట్/శేరిలింగంపల్లి : ప్రజలు తమ ఓటు హక్కును వియోగించుకోవాలని చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం మియాపూర్ ఏసీపీ నర్సింహారావు ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్ బృందంతో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, మాదాపూర్ డీసీపీ సందీప్‌ల ఆదేశాల మేరకు ఫ్లాగ్ మార్చ్ చేపట్టామన్నారు. ఓటు హక్కు ఎంతో విలువైందన్నారు. లింగంపల్లిలోని తుల్జాభవానీ దేవాలయం నుంచి లింగంపల్లి గ్రామం, ఆదర్శనగర్, నెహ్రూనగర్, గోపినగర్, పాపిరెడ్డికాలనీ, సురభీనగర్ వరకు సుమారు 3 కిలో మీటర్ల వరకు మార్చ్ నిర్వహించారు. మాదాపూర్ అడిషనల్ డీసీపీ నంద్యాల నరసింహారెడ్డి, చందానగర్, మియాపూర్, ఆర్సీపురం సీఐలు పాలవెల్లి, ప్రేమ్‌కుమార్, నరేందర్‌రెడ్డి, డీఐలు కాంతారెడ్డి, వెంకటేష్, ఎస్ఐలు, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పిఎఫ్ పోలీసులు, జవాన్లు పాల్గొన్నారు.

ఖానామెట్‌లో ఉర్సు

మాదాపూర్: మాదాపూర్‌లోని ఖానామెట్‌లో గురువారం జరిగిన ఉర్సు ఉత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యే గాంధీ పాల్గొన్నారు. ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సయ్యద్‌గౌస్, హబీబ్, అక్బర్, నవాజ్, నయీమ్, సయ్యద్ పాషా, ఖాదర్‌ఖాన్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి



టెలికాంనగర్‌లో ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు అలుపెరగని కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని టెలికాంనగర్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు గాంధీకి సంపూర్ణ మద్దతు పలికారు. భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రూ.9 వేల కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబ, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు రాజునాయక్, శ్రీను పటేల్, మూల వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ 2023

ఎన్నికల ప్రచార రథాలు ప్రారంభం



ప్రచార రథాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: గడప గడపకు సంక్షేమ పథకాలు.. గ్రామగ్రామాన అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ప్రతి పల్లెను ప్రగతికి ప్రతిరూపంగా తీర్చిదిద్దిన సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ 100 సీట్లు కైవసం చేసుకుంటుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని శ్రీ సిద్ది వినాయక ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అసెంబ్లీ ఎన్నికల ప్రచార రథాలను జెండా ఊపి ఎమ్మెల్యే ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో 60 ఏళ్లలో సాధించని ప్రగతిని 10 ఏళ్లలో చేసి చూపించడం జరిగిందని తెలిపారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా బీఆర్‌ఎస్ పార్టీ విజయాన్ని ఆపలేరన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓటు వేయండి



ప్రచారం చేస్తున్న గాంధీ సతీమణి శ్యామలాదేవి, కార్పొరేటర్ మంజుల

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీని ముచ్చటగా మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని అరికెపూడి శ్యామలాదేవి పేర్కొన్నారు. గురువారం చందానగర్‌లోని రెడ్డి కాలనీ, వివిధ బస్తీలు, కాలనీలలో స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మహిళల పక్షపాతి అని మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. అభివృద్ధి చూసి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నాగిరెడ్డి, రవీందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో కాషాయ జెండా ఎగురవేస్తాం..

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్

శేరిలింగంపల్లి: గడపగడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్‌యాదవ్ ఆదర్శనగర్, నెహ్రూనగర్‌లలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ శేరిలింగంపల్లిలో కాషాయ జెండా ఎగురవేస్తామన్నారు. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా టికెట్ మనదే... గెలుపు మనదే అని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు సోందాస్, నవతారెడ్డి, కె.ఎల్లేష్, అనిల్‌కుమార్‌యాదవ్, గుణశేఖర్, చంద్రమౌళి, ఝాన్సీ, అంబు, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న రవికుమార్‌యాదవ్ తదితరులు

ఇసుక అన్‌లోడ్ చేసి.. కూలీ మృతి

పటాన్‌చెరు టౌన్: లారీలో ఇసుకను అన్‌లోడ్ చేసిన కూలీ చెమటలతో కింద పడి మృతి చెందాడు. అమీన్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం...హైదరాబాద్ సరూర్‌నగర్‌కి చెందిన ధరావత్ చందు(43) మరో ఇద్దరు రమేష్, హరిలాల్‌తో కలిసి ఇసుక తీసుకుని లారీలో అమీన్‌పూర్‌కు గురువారం వచ్చారు. ఇసుకని అన్‌లోడ్ చేశాక, ధరావత్ చందుకు చెమటలు పోసి కింద పడ్డాడు. తోటి కూలీలు వెంటనే బీరంగూడ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.